క్రైస్తవ పండితుల అపార్థాలు – బైబిలు గ్రంథ యథార్థాలు

1

# యేసు

# ఎవరు?

నానా విధములైన అన్య బోధలచేత త్రిప్పబడకుడి! -(హెబ్రీయులకు 13:9) మిమ్మును మోస పరుచువారినిబట్టి యీ సంగతులు మీకు వ్రాయుచున్నాను. -(1 యోహాను 2:26)

M.A. అభిలాష్

**YESU EVARU?** (Telugu)

**(WHO IS JESUS?)**

First Edition : March- 2014
Copies : 1000
Price : **24/-**

© *All rights Reserved by Author*

*Judicial disputes are subject to Kakinada Jurisdiction.*

Authored and Published by

**M. A. ABHILASH**

Do 16 - 33 - 6 / G

Pachipala Vari Street,

Sambha Murthy Nagar,

Kakinada 533003, A.P, INDIA.

Contact: +91- 98485 16362

E-mail: tmcnewstmc@gmail.com

www.tmcpeace.com

Contact for books:

**SANATANA BOOKS**

+91- 9948018588

Printed at:

## చర్చించ బడిన అంశాలు

■ క్రైస్తవులారా! అబద్ధ బోధకుల నుండి క్రైస్తవ్యాన్ని కాపాడండి!!........I-II

■ పరిశీలన ఎందుకు?........2

■ పరిశీలనకు పెద్ద పీట వేస్తున్న బైబిలు........3

■ సృష్టికర్త మానవుడిని ఎందుకు పుట్టించాడు?........5

■ యేసు సృష్టికర్తయా? సృష్టిరాశియా??........8

■ యేసు విషయమై లేఖనం ఏమంటుంది?........11

■ యేసు విషయంలో నిరీక్షణ ఏమిటి?........13

■ యేసు కలిగి ఉన్న జీవము అతని సొంతమా?........16

■ యేసు స్వయంగా ఈ లోకానికి వచ్చారా?........17

■ యేసు మహిమ అతని సొంతమా?........20

■ యెహోవా తన మహిమను యేసుకు శాశ్వతంగా ఇచ్చేశాడా?........22

## యేసు ఎవరో స్పష్టపరచే పరాకాష్ఠ వచనాలు!

**తన పట్ల 'ప్రజల' అభిప్రాయాన్ని గురించి ప్రశ్నిస్తున్న యేసు—**

యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి- మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా

**యేసు సమక్షంలోనే శిష్యుల సమాధానం—**

వారు (శిష్యులు) కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి.

**తన పట్ల 'శిష్యుల' అభిప్రాయాన్ని గురించి ప్రశ్నిస్తున్న యేసు—**

అందుకాయన (యేసు)- మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు- నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తు (మెస్సీయా) వని చెప్పెను.

**తన పట్ల 'శిష్యులు' తెలిపిన అభిప్రాయాన్ని సమర్థిస్తున్న యేసు—**

అందుకు యేసు- సీమోను బర్‌యోనా! నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేగాని నరులు నీకు బయలు పరచలేదు.

మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళ లోక ద్వారాములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను.

పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను, నీవు భూలోక మందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింప బడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను-మత్తయి16:13-19

యేసు పట్ల, దేవుడు అనే విశ్వాసాన్ని కాక, క్రీస్తు అనే విశ్వాసాన్ని కలిగి ఉండటమే సరైన విధానమని పై వాక్యం ద్వారా తెలుస్తుంది. సరైన విశ్వాసం ద్వారా మాత్రమే రక్షణ లభించగలదు. వాక్య విరుద్ధ విశ్వాసం గల వారి గతి నిత్య నరకమే కాగలదు!

# క్రైస్తవులారా! అబద్ధ బోధకుల నుండి క్రైస్తవ్యాన్ని కాపాడండి!!

ప్రియ క్రైస్తవులారా! ఒక వైపు యెహోవా దేవుడు మరొక వైపు యేసు క్రీస్తు అబద్ధ ప్రవక్తలను గురించి మిమ్ములను ఏ విధంగా అప్రమత్తం చేస్తున్నారో గమనించగలరు. **మీకు ప్రవచనములు ప్రకటించు ప్రవక్తల మాటలను ఆలకింపకుడి, వారు మిమ్మును భ్రమపెట్టుదురు. వారు నన్ను తృణీకరించు వారితో మీకు క్షేమము కలుగునని యెహోవా సెలవిచ్చెననియు; ఒకడు తన హృదయ మూర్ఖత చొప్పున నడవగా వానితో- మీకు కీడు రాదని చెప్పుచు యెహోవా ఆజ్ఞనుబట్టి మాటలాడక తమకు తోచిన దర్శనమును బట్టి పలుకుదురు.** **-యిర్మీయా 23:16-17**

నిజమే నేటి అధికశాతం బోధకులు- దేవుని వాక్యాన్ని బట్టికాక, ఎవనికి తోచిన దర్శనం చొప్పున వాడు సామాన్య ప్రజలను భ్రమలకు గురిచేస్తూ, ఎవరి సంఘం వారు కట్టుకుంటూ పోతున్నారు. అలాంటి వారి మాటలు వినవద్దని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. అటువంటి వారి గురించి యేసు ఏవిధంగా హెచ్చరిస్తున్నారో ఈ క్రింది గమనించగలరు. **'అబద్ధ ప్రవక్త'లను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు. కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు.** **-మత్తయి 7:15**

**(యేసు) ఇట్లనెను- శాస్త్రులను గూర్చి జాగ్రత్తపడుడి... వారు విధవ రాండ్ర యిండ్లను దిగ మ్రింగుచు, మాయ వేషముగా దీర్ఘప్రార్థనలు చేయుదురు. వారు మరి విశేషముగా శిక్ష పొందుదురని తన శిష్యులతో చెప్పెను.** **-లూకా 20:45-47**

పై వాక్యాలలో యేసు హెచ్చరిస్తున్నట్లే- సంఘస్థుల ద్వారా బాగుపడి సంఘన్ని ఏమాత్రం పట్టించకొనని మరియు అమాయకుల ఆస్తులను కాజేసే క్రూర స్వభావం కలిగిన బోధకులే నేడు ఎక్కువైపోయారు. ప్రజలను దోచుకుంటే దోచుకున్నారు, కనీసం స్వచ్ఛమైన 'క్రీస్తు **బోధ**' బోధిస్తున్నారా అంటే అదీలేదు! వారి లక్షణాలు:
**మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీ (క్రైస్తవుల) లోనూ అబద్ధబోధకులుందురు... వీరిని బట్టి సత్యమార్గము (క్రైస్తవ్యం) దూషింపబడును. వారు అధిక లోభులై, కల్పనావాక్యములు చెప్పుచు మీ (సంఘస్థుల) వలన లాభము సంపాదించుకొందురు...** **-2 పేతురు 2:1-3**

ఈ వాక్యమును బట్టి వారిని ఈ మూడు లక్షణముల ద్వారా కనిపెట్ట వచ్చు- **1**,పదియవ వంతు అందరి దగ్గరా తీసుకుంటారు. కాని వారు మాత్రం ఎవరికీ ఇవ్వరు. ఇది వారిలో ఉన్న లోభత్వానికి గుర్తు. వాస్తవానికి యేసు- **'ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి'**. -మత్తయి 10:82, అని ఆజ్ఞాపించి ఉన్నారు. ఇక, **2**, పరిశుద్ధ గ్రంథంలో లేని కల్పనా వాక్యములు (తప్పుడు విశ్వాసములు) బోధిస్తుంటారు. అందుకే



**'అనైతికత-అనైక్యత'**ల వంటి చెడులు నేటి క్రైస్తవ సమాజంలోనూ ఏర్పడ్డాయి. **3**, కడు బీద విశ్వాసుల వలన సైతం లాభము (కానుకలు) సంపాదించుకుంటారన్నది అందరికీ తెలిసిందే. పైవాక్యం ప్రకారం అబద్ధ బోధకుల మౌలిక లక్షణాలు ఇవే! అలాంటి వారిని గురించి యేసు శిష్యుడైన యోహాను హెచ్చరికను ఈ క్రింది గమనించగలరు.
**చిన్న పిల్లలారా, యిది కడవరి గడియ. క్రీస్తు విరోధి వచ్చునని వింటిరిగదా ఇప్పుడును అనేకులైన క్రీస్తు విరోధులు బయలుదేరియున్నారు; ఇది కడవరి గడియ అని దీనిచేత తెలుసుకొనుచున్నాము. వారు మనలో (క్రైస్తవులలో) నుండి బయలు వెళ్లిరి గాని వారు మన సంబంధులు కారు.** **-1 యోహాను 2:18,19**

పై వాక్యాల ప్రకారం- క్రైస్తవులలో నుండే క్రైస్తవ్యాన్ని నాశనం చేసే అబద్ధ బోధకులు వస్తారని తెలుస్తుంది. అలాంటి వారినుండి క్రైస్తవ్యాన్ని కాపాడుకొని, క్రీస్తు ప్రకటించిన సత్యసువార్త ద్వారా **'నైతికత-ఐక్యత'**లను తిరిగి సాధించాలనుకొనే, క్రైస్తవులూ మరియు బైబిలు **'యథార్థ సువార్త'**ను తెలుసుకోదలచిన హిందువులూ, ముస్లిములూ **'క్రైస్తవ పండితుల అపార్థాలు-బైబిలు గ్రంథ యథార్థాలు'** అనే ప్రధాన శీర్షిక ఆధారంగా బైబిలు వెలుగులో ఆత్మ ప్రేరణతో వ్రాయబడిన ఈ క్రింది పది అంశాల పుస్తకాలను తప్పక చదవాలి.


**1. యేసు ఎవరు? ...... 24**
**2. ఈ వాక్యాల ప్రకారం యేసు దేవుడా? ...... 67**
**3. కాబట్టి యేసు దేవుడా? ...... 30**
**4. రక్షణ కొరకు తెలుసుకోవలసిన ఆరు వాస్తవాలు ...... 40**
**5. తండ్రీ! కుమారా! సంబోధనల వాస్తవికత ...... 31**
**6. యేసు దేవుడా? క్రీస్తా? ...... 31**
**7. యేసు దృష్టిలో దేవుడు ఎవరు? ...... 44**
**8. యేసు దైవత్వాన్ని బైబిలు సమర్థిస్తుందా? లేదా? ...... 100**
**9. దేవుడు ఒక్కడా? త్రిత్వమా? ...... 78**
**10. విజయవంతమైన యేసు సంస్కరణావిధానం ...... 58**



రచయిత

**M.A. అఖిలాష్**

సర్వశక్తిమంతుడైన దేవుని పేరుతో...

కుటుంబపరంగానో లేక ప్రచారం ఆధారంగానో అనేక మంది యేసును విశ్వసిస్తున్నారు. అయితే యేసును నమ్ముకున్న ప్రతి ఒక్కరికి యేసును ఎలా విశ్వసించాలి? అన్న ప్రశ్నకు నిర్దిష్ట సమాధానం తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే- యేసుపట్ల సరైన విశ్వాసం ద్వారా మాత్రమే రక్షణ లభించగ లదు. యేసుపట్ల అస్పష్ట విశ్వాసం ద్వారా రక్షణ లభించటం సాధ్యం కాదు. నేడు క్రైస్తవ సమాజంలో యేసును గురించి అనేక గందరగోళ విశ్వాసాలు నెలకొని ఉన్నాయి. కొందరు యేసును దేవుని కుమారుడు అంటే మరికొందరు మెస్సియా అని కొందరు సాక్షాత్తు దేవుడు అంటే మరికొందరు దేవునిలో మూడవ భాగంగా నమ్ముతున్నారు. ఇంకా కొందరయితే యేసు సంపూర్ణ మానవుడు మరియు సంపూర్ణ దేవుడు అని అంటున్నారు. హేతువు ప్రకారం ఒకే వ్యక్తి విషయంలో ఇన్ని పరస్పర విరుద్ధ విశ్వాసాలు సత్యం కాజాలవు. వాస్తవానికి యేసు ఎవరు? అన్న ప్రశ్నకు నిర్దిష్ట సమాధానం బైబిలు గ్రంథ పరిశీలన ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కాని కొందరైతే ఈ పరిశీలనలు, పరిశోధనలు ఎందుకు? అని అభ్యంతరం తెలియ జేస్తుంటారు. ఇంతకూ ఈ పరిశీలన గురించి పరిశుద్ధ బైబిలు గ్రంథం ఏమంటు న్నదో ముందుగా గమనిద్దాం.



**యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి** **-యెషయ 34:16**

ఈ వాక్యం ప్రకారం గ్రంథాన్ని పరిశీలించి చదవటం ప్రతి క్రైస్తవునిపైనా తప్పనిసరి అయిపోయింది. ఎందుకంటే పైవాక్యం ఒక సలహా పూర్వకంగా లేదు. ఆజ్ఞాబద్ధంగా ఉన్నది. కనుక ఏదో ఒక విశ్వాసములే! ఏదో ఒక ఆలోచనలే!! అని నిర్లిప్తంగా జీవితం గడిపేసే అవకాశం ఒక నిజమైన క్రైస్తవునికి తగదు.

## పరిశీలన ఎందుకు?

పరిశీలన చేయకపోతే ఏమవుతుంది? దాని ద్వారా కలిగే నష్టం ఏమిటి? అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పే ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

**ఒకని మార్గము వాని దృష్టికి యథార్థముగా కనబడును. అయినను తుదకు అది మరణమునకు చేరును.** **-సామెతలు 16:25**

పరస్పరం పొంతనలేని విశ్వాసాలు కలిగి ఉండికూడా, హాయిగా జీవితం గడిపేస్తున్నా మని భ్రమిస్తున్న క్రైస్తవ సోదరులు పైవాక్యాన్ని సునిశితంగా పరిశీలించాలి. ఎందుకంటే తనకు నచ్చిన మార్గాన్ని గుడ్డిగా అనుసరించేవారికి ఈ వాక్యం ఒక **'పిడుగు'** లాంటింది. ఈ వాక్యాన్నిబట్టి ప్రతి క్రైస్తవుడు- **'నేను అవలంభిస్తున్న మార్గం సత్య విరుద్ధమేమో! వాక్య విరుద్ధమేమో!!'** అనే ఆందోళనతో యథార్థమార్గం ఏదయి ఉందోనని తీవ్ర అన్వేషణ సాగిస్తుండాలి. ఒక వేళ వాక్య విరుద్ధమైన మార్గాన్ని అనుసరించి, చనిపోయి, పునరుత్థాన దినంనాడు లేచిన తరువాత **'ఓ క్రైస్తవుడా! నీవు అవలంబించిన మార్గం క్రీస్తు బోధించినది కాదు!'** అని దేవుని తరుపున తీర్పు జరిగిపోతే, ఇక అతనికి తిరిగి సవరించుకునే అవకాశం ఎంతమాత్రమూ దొరకదు. నిత్యనరకమే అతని గతి అవుతుంది గమ్మయము. ఆ నరకంలో పరిస్థితి ఎలా ఉంటుంది అని ప్రశ్నిస్తే యేసు ఈ క్రింది విధంగా సమాధానం ఇస్తున్నారు గమనించగలరు.

**అగ్ని ఆరదు, పురుగు (మనిషి) చావదు.** **-మార్కు 9:48**

**ఆ దినములలో మనుష్యులు మరణమును వెతుకుదురు. గాని అది వారికి దొరకనే దొరకదు. చావవలెనని ఆశపడుదురు గాని మరణము వారి యొద్దనుండి పారిపోవును**

**-ప్రకటనలు 9:6**

ఒక మనిషికి పరాకాష్ఠస్థాయి నష్టం తిరిగిరాని శాశ్వత నరకాగ్నికి బలైపోవటం కంటే ఇంకేముంటుంది? ఇంతటి దారుణ దుఃఖఃస్థితి అతనికి దాపురించడానికి గల కారణం ఏమిటి? అని ప్రశ్నిస్తే తాను అవలంబిస్తున్న మార్గాన్ని అది యథార్థ మయినదా? కాదా? అని అతను స్వయంగా పరిశీలించుకొనక పోవడమే నన్నది సమాధానం. దీనిని బట్టి పైహెచ్చరిక ఎంతటి తీవ్రత కలిగియున్నదో ఊహించుకో వచ్చు. ఇంకా దీనిని బట్టి పరిశీలనను నిర్లక్ష్యంచేస్తే సంభవించే పరిణామం ఎంత దారుణంగా ఉంటుందో కూడా పై వాక్యాలను బట్టి గ్రహించ వచ్చు.

## పరిశీలనకు పెద్ద పీట వేస్తున్న బైబిలు

ఇతర ధార్మిక వర్గాలలో వలే నేటి క్రైస్తవ సమాజంలో ధార్మికంగా విపరీత పోకడలు పెరుగుతూ పోతున్నాయి. సామాన్య క్రైస్తవులు విశ్వాసపరమైన గందర గోళానికి లోనవుతున్నారు. పర్యవసానంగా వారిలో నైతికపరమైన రుగ్మతలు పెచ్చరి ల్లుతున్నాయి. ఇంకా వారి మధ్య అనైక్యత ఏర్పడి ఒక సంఘర్షణాత్మక వాతావరణం నెలకొంటూ పోతుంది. వీటన్నిటికీ మూలకారణం బైబిలు బోధిస్తున్న యథార్థ మార్గాన్ని పరిశీలించి, దానిని అనుసరించకపోవడమే. వాస్తవానికి బైబిలు గ్రంథం పాతనిబంధన నుండి పత్రికల వరకూ 'పరిశీలన'కు ఎంతో ప్రాముఖ్యత ఇస్తుంది.

**యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు- మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములనుగూర్చి విచారించుడి, మేలు కలుగు మార్గమేది అనియడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును. -యిర్మీయా 6:16**

ఈ వాక్యంలోని గమనార్హ విషయాలు: ఒకటి మార్గాలు లేక విశ్వాసాలు అనేకం కనిపిస్తున్నప్పుడు ఏది నచ్చితే దానిని గుడ్డిగా అనుసరించ కూడదని అర్థమవుతుంది. రెండవది ఆ అనేక మార్గాలలోని యథార్థమార్గం ఏదో విచారించి నిర్ధారించుకొని, తదుపరి ఆ మార్గంపై నడవాలి. మూడవది ప్రతి మార్గమూ 'మేలు' కలుగజేయలేదు. కనుక మేలు కలిగించే ఆ ఏకైక మార్గం ఏదో స్పష్టమయినప్పుడు మాత్రమే, ఆ మార్గం లేక ఆ విశ్వాసంలో ప్రవేశించాలి. ఎందుకంటే ఆ ఒక్క మార్గం తప్ప మిగిలిన మార్గాలన్నీ '**కీడు**' కలిగించేవే కనుక. నాలుగవది ఆవిధంగా చేస్తేనే మీకు నెమ్మది అనగా శాంతి సిద్ధిస్తుంది. నేటి అధికశాతం విశ్వాసులలో శాంతి మృగ్యమైపోవటానికి కారణం, వారు వాక్యం వెలుగులో '**విచారణ**' లేక '**పరిశీలన**' చేయకుండానే వివిధ కాల్పనిక విశ్వాసాలను గుడ్డిగా అనుసరించటమే. ఈ విధంగా '**పరిశీలన**'కు ఎంతటి ప్రాముఖ్యత ఇవ్వబడిందో అర్థమవుతుంది. ఈ విషయంలో యేసు విధానం ఏమిటో గమనించండి.



**శాస్త్రులలో ఒకడు వచ్చి, వారు తర్కించుట విని, ఆయన వారికి బాగుగా ఉత్తరమిచ్చెనని గ్రహించి- ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనదేదని ఆయన నడిగెను.**

**-మార్కు 12:28**

ఈ వాక్యాన్నిబట్టి యేసు స్వయంగా ఆయా వర్గాలవారితో సత్యసువార్త విషయంలో తర్కిస్తుండేవారని స్పష్టంగా బోధపడుతుంది. ఈ సాంప్రదాయాన్నే పౌలుకూడా కొన సాగించిన వైనం మనకు కనిపిస్తుంది.

**కాబట్టి సమాజమందిరములలో యూదులతోను, భక్తిపరులైన వారితోను ప్రతి దినమున సంతవీధిలో తన్ను కలిసికొను వారితోను తర్కించుచు వచ్చెను.**

**-అపో॥ కా॥ 17:17**

**అతడు ప్రతివిశ్రాంతి దినమున సమాజ మందిరములో తర్కించుచు, యూదులను గ్రీసు దేశస్థులను ఒప్పించుచు నుండెను. -అపో॥ కా॥ 18:4**

**తరువాత అతడు సమాజమందిరములోనికి వెళ్లి ప్రసంగించుచు, దేవుని రాజ్యమునిగూర్చి తర్కించుచు, ఒప్పించుచు ధైర్యముగా మాటలాడుచు మూడు నెలలు గడిపెను. -అపో॥ కా॥ 19:8**

పై వాక్యాలు పౌలు సువార్తను ఏవిధంగా ప్రచారం చేసేవాడో తెలియ పరుస్తున్నాయి. ఆనాడు పౌలు అన్ని వర్గాల ప్రజలను, అన్నివేళలా, ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ తర్కించి మరీ ప్రజలచే ఈ సువార్తను ఒప్పించేవాడని తెలుస్తోంది.

అయితే నేటి మతపెద్దలు మాత్రం తమ అనుయాయులను వేరేమతం వారితో తర్కించమని చెప్పటం బహుదూరం కనీసం తోటి క్రైస్తవ మతపెద్దలతో కలువవద్దని, వారితో మాటలాడవద్దని వారిస్తున్నారు. ఏవిశ్వాసి అయినా తమ మతపండితులను ప్రశ్నిస్తే, వారు **'ఏమిటీ! నన్నే ప్రశ్నిస్తావా!?'** అని గద్దిస్తున్నారు. ఇంకా కాస్త వివరణ అడిగితే చాలు సాతాను పట్టినవారిగా ముద్రవేస్తున్నారు. వారి ఈ విపరీతధోరణి బైబిలు గ్రంథజ్ఞాన రాహిత్యానికి ఒక గుర్తు. డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న వారికి బైబిలు బలపరుస్తున్న తర్కము, పరిశోధనలు వంటివి అసలు పడవు. నిత్య జీవితాన్ని కోరుకునే వారెవరూ తర్కంనుండి తప్పించుకోలేరు. తమవద్ద సత్యం లేనివారే తర్కానికి భయపడతారు. అలాంటివారు తర్కానికి నిలువని ఏసిద్ధాంత మైనా, అది ఎంత గొప్పగా కనిపిస్తున్నా లేక కోట్లాదిమంది ప్రజలు దానిని అనుసరిస్తు న్నా, అది ఎంత మాత్రం సత్యం కాజాలదు అన్న విషయాన్ని తెలుసుకోవాలి.

నిజమైన క్రైస్తవులు తాము అనుసరిస్తున్న సువార్త సత్యమా? కాదా? అన్నది నిర్ధారించటానికి లేఖనాలను తర్కించుకోవటం ద్వారా పరీక్షించుకోవాలి. తర్కానికి తట్టుకొని, గ్రంథ ఆధారంగా ఏ విశ్వాసం నిలుస్తుందో అది మాత్రమే సత్యం కాగలదు. అలాంటి సత్య విశ్వాసమే స్వీకారయోగ్యము మరియు అనుసరణీ యము. అలాంటి వారి కోసమే పరలోకరాజ్యము. తర్కం అంటే తోకముడిచే వారికి అగ్నిగంధకమే నిత్యనివాసం అవుతుంది. అయితే మనలోని ప్రతి ఒక్కరూ **'కుతర్కానికి'** మాత్రం దూరంగా ఉండాలి. కాని **'తర్కానికి'** కాదు అనే యథార్థాన్ని మరువరాదు.

## సృష్టికర్త మానవుడిని ఎందుకు పుట్టించాడు?

బైబిలుగ్రంథాన్ని అనుసరించే ప్రతి ఒక్కడూ ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఏమిటో తెలుసుకోవాలి. ఈ ప్రశ్నకు బైబిలుగ్రంథం ఇచ్చే సమాధానం ఏమిటో గమనించండి.



**యెహోవా మోషేను చూచి- ఇదిగో నేను ఆకాశమునుండి మీకొరకు ఆహారమును కురిపించెదను; వారు నా ధర్మశాస్త్రము ననుసరించి నడుతురో లేదో అని నేను వారిని <u>పరీక్షించునట్లు</u> ఈ ప్రజలు వెళ్లి ఏనాటి బత్తెము ఆనాడే కూర్చుకొనవలెను.**

**-నిర్గమకాండము 16:4**

**...ఏలయనగా మీరు మీ దేవుడైన యెహోవాను మీ పూర్ణ హృదయముతోను, మీ పూర్ణాత్మతోను ప్రేమించుచున్నారో లేదో తెలిసి కొనుటకు మీ దేవుడైన యెహోవా మిమ్మును <u>పరీక్షించుచున్నాడు</u>.** **-ద్వితీ॥ కా॥ 13:3**

సృష్టికర్త పరీక్షించటానికి మనిషిని పుట్టించాడని పై వాక్యాల ద్వారా అర్థమవు తుంది. అయితే ఈ పరీక్ష ఎందులో అన్నది కూడా ఈ వాక్యాలు తెలియజేస్తున్నాయి. అదేమంటే ధర్మశాస్త్రం మౌలికంగా రెండు విషయాలను స్పష్టపరుస్తున్నది. వాటిలో మొదటిది సృష్టికర్త **'నిషేధించి'**నవి. రెండవది సృష్టికర్త **'అనుమతించి'**నవి. ఇక ధర్మశాస్త్రం అనుసరిస్తాడా? లేదా? అంటే ఒక విశ్వాసి తనకు ఎంతో లాభదాయకంగా ఉన్న దానిని సైతం దేవుని ప్రేమలో ఆయన ఆశీర్వాదం కోసం త్యాగం చేస్తాడు. అదే అవిశ్వాసిగాని, అల్పవిశ్వాసిగాని అయితే దేవుని ప్రేమా ఆశీర్వాదాలను ఖాతరు చేయక తన వ్యక్తిగత స్వార్థమే పరమార్థంగా పెట్టుకొని దైవం నిషేధించిన వాటిని సయితం ఆచరణ చేస్తాడు. ఈ రెండురకాల ప్రవర్తనలలో ఏ విధమయిన ప్రవృత్తి కలిగి ఉంటాడు? అన్నదే సృష్టికర్త మనిషికి పెట్టిన పరీక్ష. ఈ పరీక్షలో **'సఫలమైతే'** కలిగే గొప్పప్రయోజనం ఏమిటో మరియు ఈ పరీక్షలో **'విఫలమైతే'** సంభవించే భయంకర పరిణామం ఏమిటో కూడా యెహోవా స్పష్టపరుస్తున్నాడు.

**చూడుడి: నేడు నేను మీ యెదుట దీవెనను శాపమును పెట్టుచున్నాను. నేడు నేను మీకాజ్ఞాపించు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను వినక నేడు నేను మీకాజ్ఞాపించు మార్గమును విడిచి మీరెరుగని ఇతర దేవతలను అనుసరించిన యెడల శాపమును మీకు కలుగును.** **-ద్వితీ॥ కా॥ 11:26-28**

**నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుటను ఉంచి, భూమ్యాకాశాలను మీమీద సాక్షులుగా పిలుచుచున్నాను.** **-ద్వితీ॥ కా॥ 30:19**

మనిషి ముందు రెండు మార్గాలను సృష్టికర్త ఉంచిన వైనం పై వాక్యాల ద్వారా స్పష్టంగా కనిపిస్తున్నది. మొదటిది '**ఇహపరాలలో మేలు**' కలిగించే మార్గం. రెండవది '**ఇహపరాలలో కీడు**' కలిగించే మార్గం.

సకల జీవులలో ఏ జీవికిలేని విచక్షణా జ్ఞానాన్ని సృష్టికర్త ఒక్క మనిషికే ప్రసాదించాడు. ఈ విచక్షణా జ్ఞానం ఆధారంగా ఏది '**సత్య మార్గము?**' ఏది '**అసత్య మార్గము?**' అన్నది తర్కించి, గుర్తించి అనుసరించాలన్నది సృష్టికర్త అసలు ఉద్దేశ్యం. ఇంకా ఆ విధంగా గుర్తించబడిన మార్గాన్ని మానవుడు స్వీకరించి అనుసరించాలన్నది ఆయన అభిలాష.

ఈ '**దీవెన-శాపము, జీవము-మరణము**' అనే విభిన్న పరిస్థితులకు మనిషిని గురిచేసే విశ్వాసాలు లేక మార్గాలు అతని చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. వాటిలో కీడును కలిగించే విశ్వాసాలను తప్పించుకొని మేలును కలిగించే విశ్వాసాలను ఎన్నుకోవాలి. దీనికి ఒక మంచి ప్రక్రియను పౌలు సూచిస్తున్నాడు, గమనించగలరు.

**సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి. ప్రతి విధమైన కీడునకును దూరంగా నుండుడి.** **-1 థెస్సలోనికయులకు 5:21-22**

సృష్టికర్త మనిషిని మంచి చెడులమధ్య నిలబెట్టి అతడు ఎటు మొగ్గుతాడో పరీక్షించ దలిచాడని గత పంక్తులలో తెలుసుకున్నాము. ఈ పరీక్షలో సఫలమైన వారి కొరకు '**నిత్యజీవము**' మరియు ఈ పరీక్షలో విఫలమైనవారి కొరకు '**నిత్యమరణము**'ను పర్యవసానాలుగా నిర్ధారించి ఉంచాడు. ప్రస్తుతం మనిషి ముందు '**మంచి మార్గము**' మరియు '**చెడుమార్గము**' రెండు కలగాపులగంగా ఉన్నాయి. ఈ తరుణంలో మనిషి చేయవలసినది ఏమిటి? అని ప్రశ్నిస్తే దానికి పైవాక్యం స్పష్టమైన సమాధానం ఇస్తుంది. అది '**సమస్తము పరీక్షించి**' అనగా తనముందు ఉన్న అనేక విశ్వాసాలలో నిజమయిన విశ్వాసం ఏదో పరీక్షించి, తర్కించి మరీ తెలుసుకోవాలి. తద్వారా



మాత్రమే '**ప్రతి విధమైన కీడు**' నుండి తప్పించు కోవటం సాధ్యమవుతుంది. ఈ విధంగా పరీక్షించి, తర్కించి సత్య మార్గాన్ని కనుగొని అనుసరించిన వారికే నిస్సందేహంగా మేలు కలుగుతుంది.

## యేసు సృష్టికర్తయా? సృష్టిరాశియా??

బైబిలుగ్రంథం కాస్త వివరంగా చదివితే యేసు ఎవరు? అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లభిస్తుంది. అయితే నేడు యేసును గూర్చిన గందరగోళ విశ్వాసాలలో ప్రధానమై నవి రెండు. ఒకటి యేసు సాక్షాత్తు సృష్టికర్తయా? రెండు సృష్టికర్తచే సృష్టించబడిన సృష్టిరాశి యా? బైబిలుగ్రంథం ప్రకారం సృష్టికర్త ఎవరు? అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ముందు గా తెలుసుకుందాము.

## సృష్టికర్త ఎవరు?

**ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను.** **-ఆది॥ కా॥ 1:1**

**దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిదిగా నుండెను.** **-ఆది॥ కా॥ 1:31**

**నీవే, అద్వితీయుడైన యెహోవా!, నీవే ఆకాశమును మహాకాశములను వాటి సైన్యములను, భూమిని దానిలో ఉండునది అంతటిని, సముద్రములను వాటిలో ఉండునది అంతటిని సృజించి వాటన్నిటిని కాపాడువాడవు. ఆకాశ సైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది.** **-నెహెమ్యా 9:6**

బైబిలుగ్రంథంలోని ఇటువంటి అనేక వాక్యాలద్వారా '**ఒక్క యెహోవా మాత్రమే సర్వసృష్టికి కర్త**' అని స్పష్టంగా బోధపడుతుంది. పైవాక్యాలలోని గమనార్హమైన విషయాలు ఏమిటంటే ఒకటి సృష్టికర్త భూమ్యాకాశాలను సృష్టించాడు. రెండవది ఈ భూమ్యాకాశాలలోని '**ప్రతిదానిని**' ఆయనే సృష్టించాడు. ఈ రెండు విషయాల ప్రకారం ఒక్క సృష్టికర్త మాత్రమే సృష్టికి అతీతుడు అని తెలుస్తుంది. అంటే ఆయన ఒక్కడుతప్ప మహాదేవతలు, ఆత్మలు, పరిశుద్ధులు, మహాపురుషులు సైతం ఆయన సృష్టితాలే.

## యేసు కూడా దేవుని సృష్టియా?

యేసును దేవునిగా నేటి క్రైస్తవులందరూ అంగీకరించరు. కొందరు యెహోవాను మాత్రమే దేవునిగా నమ్మేవారున్నారు. అయితే అధికశాతం క్రైస్తవులు మటుకు యేసును దేవునిగా నమ్ముతున్నారు. యేసును దేవునిగా విశ్వసించేవారిలో కూడా ఏకాభిప్రాయం లేదు. ఏది ఏమయినప్పటికీ యేసు నిజంగా దేవుడైవుంటే అతడు సృష్టికి అతీతుడై ఉండాలి. ఆయన లేని కాలమంటూ ఉండరాదు. అంటే ఆయన సనాతనుడయి ఉండాలి, ఏ విధంగా దేవుడైన యెహోవా సనాతంగా ఉన్నాడో. యేసు దైవత్వాన్ని నిరూపించటానికి మన పండితులు ఈ క్రింది వాక్యాన్ని చూపిస్తుంటారు.

**పూర్వకాలమందు తన సృష్ట్యారంభమున తన కార్యములలో ప్రథమమైన దానిగా యెహోవా నన్ను కలుగజేసెను. అనాది కాలము మొదలుకొని మొదటినుండి భూమి ఉత్పత్తియైన కాలమునకు పూర్వము నేను నియమిం పబడితిని. ప్రవాహ జలములు లేనప్పుడు నీళ్లతో నిండిన ఊటలు లేనప్పుడు నేను పుట్టితిని. పర్వతములు స్థాపింప బడక మునుపు కొండలు పుట్టకమునుపు భూమి దాని మైదానములను ఆయన చేయకమునుపు నేల మట్టిని రవ్వంతయు సృష్టింపక మునుపు నేను పుట్టితిని.**

**-సామెతలు 8:22-26**

పై వాక్యాలను పరిశీలిస్తే వాటిలో మాట్లాడుతున్న వ్యక్తి క్రైస్తవ పండితుల ప్రకారం యేసు ఈ వాక్యాలలో చెప్పేదేమిటి?- '**నన్ను యెహోవా కలుగజేశాడు**' అంటే అంతకు మునుపు ఆయన లేనట్టే కదా! ఇంకా '**నేను నియమించబడితిని**' అంటే నియమించేవాడు ఒకడు ఉన్నట్టే కదా! తరువాత '**నేను పుట్టితిని**' అని అంటున్నారు. ఇక్కడ గమనించవ లసిన విషయం ఒకటుంది. అదేమిటంటే ఈ పుట్టుక ఇహంలో మరియకు పుట్టటం గురించా? లేక పరంలో దేవునిచే పుట్టించబడ టమా? దీనికి సరియైన సమాధానం ఏమిటంటే పరంలో దేవునిచే పుట్టించబడటమే. యేసు దేవుని సృష్టి అని పౌలు కూడా స్పష్ట పరుస్తున్నాడు.



**ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు.**

**-కొలస్సీయులకు 1:15**

**లవోదికయలో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము- ఆమేన్ అనువాడును నమ్మకమయిన సత్యసాక్షియు దేవుని సృష్టికి ఆదియునైన వాడు చెప్పు సంగతు లేవనగా?** **-ప్రకటనలు 3:14**

దేవుని సృష్టి అంతటికి ప్రథమంగా యేసు సృష్టించబడ్డారు అని పైవాక్యాలు స్పష్ట పరుస్తున్నాయి. ప్రథమంగా యేసు పుట్టారు కాబట్టి పుట్టించినవానితో సమానం అని అనగలమా? ప్రథమపుట్టుక, అంతిమపుట్టుక అనేవి పుట్టించేవానితో సమానం చేయజాలవు. '**సృష్టిసృష్టే! అది ఎప్పుడు సృష్టించబడినా సరే!!**' ఇక యేసును పుట్టించిన వాడు ఎవరో ఈ క్రింది వాక్యంలో పౌలు మరింత స్పష్టంగా తెలియపరు స్తున్న వైనాన్ని గమనించగలరు.

**అతని సంతానమునుండి <u>దేవుడు</u> తన వాగ్దానము చొప్పున ఇశ్రాయేలు కొరకు రక్షకుడగు <u>యేసును పుట్టించెను</u>.** **-పోస్తులులకార్యములు 13:23**

**<u>దేవుడు</u> తన <u>సేవకుని (యేసును) పుట్టించి</u>...** **-పోస్తులులకార్యములు 3:26**

**యేసే క్రీస్తుయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టియు న్నాడు. పుట్టించిన వానిని (యెహోవాను) ప్రేమించు ప్రతివాడును <u>ఆయన (యెహోవా) మూలముగా పుట్టిన వానిని (యేసును) ప్రేమించును</u>.** **-1యోహాను 5:1**

**<u>దేవుని కృపవలన</u> ఆయన ప్రతిమనుష్యుని కొరకు మరణము అనుభవించు నట్లు, దూతలకంటే కొంచెము తక్కువగా <u>చేయబడిన యేసు</u>...** **-హెబ్రీ॥ 2:9**

దేవుడైన యెహోవాయే యేసును పుట్టించాడని పైవాక్యాల ద్వారా స్పష్టమవు తుంది. అయితే ఇక్కడ '**పుట్టించటం**' అనేది ఇహలోకంలో పుట్టించడాన్ని సూచి స్తుంది. యేసు దేవునితో సమానమయిన అస్తిత్వం అని భావించేవారు ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. అదేమిటంటే యెహోవా యేసును పుట్టిస్తే పుట్టకూడదు.

ఆయన స్వయంగా ఈలోకంలో పుట్టాలి. కాని వాక్యం అలాలేదు. '**దేవుడు యేసును పుట్టించెను**' అని చెబుతున్నది. యేసు యెహోవా యొక్క సేవకుడు అని అనటాన్ని అది స్పష్టంగా సూచిస్తుంది. యెహోవా ఏవిధంగా తన స్వీయశక్తితో పనిచేస్తున్నాడో అలాగే పని చేసేవారిని యెహోవాతో సమానంగా భావించే అవకాశం ఉంటుంది. పుట్టిస్తే పుట్టేవానిని, పంపిస్తే వచ్చేవానిని మరియు పిలిస్తే వెళ్లిపోయేవానిని యెహోవాకు దీటయిన వానిగా, సమానమైన వానిగా భావించటం విజ్ఞత అనిపించుకోదు. ఇది దేవునిపట్ల పరమ ద్రోహముకూడా. ఇలా ఇంకా అనేక వాక్యాలు యేసు దేవునియొక్క సృష్టి మాత్రమే తప్ప సృష్టికర్తగాని లేక సృష్టికర్తలోని భాగంగాని కాదని సుస్పష్టంగా ప్రకటిస్తున్నాయి.

## యేసు విషయమై లేఖనం ఏమంటుంది?

ఈ లోకానికి రాబోయే పరిశుద్ధులను గురించి ముందుగానే తెలియజేయటం దేవుని సాంప్రదాయం. ఈ విధంగా తెలియజేయబడే వాక్యాలనే '**లేఖనములు**' అని అంటారు. ఈ లేఖనములు ఒక్క యేసు విషయంలోనే కాక రాబోయే అనేక మంది ప్రవక్తలను గురించి కూడా ప్రవచించబడ్డాయి. ఈ లేఖనముల ద్వారా సృష్టికర్త రాబోయేవారి లక్షణాలు, వారి కార్యకలాపాలను గురించి కూడా తెలియజేస్తాడు.

ఈ విషయాలు ముందుగానే తెలియజేయటంలో రెండు ఉద్దేశ్యాలు ఉన్నాయి. మొదటిది అబద్ధ ప్రవక్తలు బయలుదేరి '**మేమే ప్రవక్తలము**' అని ప్రకటించినప్పుడు, ప్రజలు ఆ లక్షణాలను పోల్చుకొని వారి వంచన నుండి తప్పించుకోవడానికి, రెండవది నిజమయిన ప్రవక్తలు వచ్చినప్పుడు వారి లక్షణాలు తెలియని కారణంగా ప్రజలు వారిని తిరస్కరించ కుండా గుర్తించి నమ్మటానికి.

ఇంతకూ యేసురాకకు సంబంధించి, యేసుకు పూర్వం '**లేఖనం**' ఏమని ప్రవచిస్తోంది. అంటే యెహోవాయే, యేసులా రూపాంతరం చెంది రానున్నాడని ప్రవచిస్తుందా? లేక యేసుక్రీస్తుగా రానున్నాడని ప్రకటిస్తుందా? ఈ ప్రశ్నలకు బైబిలుగ్రంథం ఇచ్చే సమాధానం ఏమిటో పరిశీలించండి.



**యెరూషలేమును మరల కట్టించవచ్చునని ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలు కొని అభిషిక్తుడగు అధిపతి వచ్చువరకు ఏడు వారములు పట్టునని స్పష్టముగా గ్రహించుము.** -దానియేలు 9:25

**కాబట్టి ప్రభువు తానేయొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భ వతియై కుమారునికని అతనికి ఇమ్మానియేలను పేరు పెట్టును.** -యెషయా 7:14

అభిషిక్తుడగు అధిపతి రానున్నాడని పై వచనములద్వారా తెలుస్తోంది. కాని యెహోవా రానున్నాడని మాత్రం లేఖనం చెప్పటం లేదు. అలాగే కన్యక గర్భవతియై కుమారుని కననున్నదని వాక్యం చెబుతున్నదే కాని దైవాన్ని కనబోతోంది అని లేఖనం పలుకటం లేదు. యేసు దేవుడు అని నిరూపించటానికి సాధారణంగా క్రైస్తవ పండితులు ఉపయోగించే లేఖనాన్ని పరిశీలించగలరు.

**ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింప బడెను. ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బల వంతుడైన దేవుడు నిత్యుడగుతండ్రి, సమాధానకర్త యగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.** -యెషయా 9:6

సృష్టికర్తకు సంబంధించిన కొన్ని లక్షణాలను, సామర్థ్యాలను ప్రస్తావించి, ఈ పేరు పెట్టబడును అని లేఖనభాగం స్పష్టంగా చెబుతోంది. ఉదాహరణకు మనం మగపిల్లకు '**యేసు**' అని ఆడపిల్లలకు '**మరియ**' అని నామకరణం చేస్తుంటాము. అంత మాత్రాన వారు సాక్షాత్తు యేసు, మరియలు అయిపోతారా? లేదే! ఒకవేళ ఆ పేర్లు పెట్టినందుకు ఎవరయినా సాక్షాత్తు యేసు, మరియలు గానే భావిస్తే అలాంటి వారిని మనం ఎలా పరిగణిస్తాము? అలాంటి వారిని ఖచ్చితంగా అవివేకులు అని తీర్మానిస్తాం.

అటువంటప్పుడు లేఖనభాగంలో '**అతనికి పేరు పెట్టబడును**' అని సూచిస్తున్నప్పటికీ యేసును సాక్షాత్తు యెహోవాగా భావించటం ఎంతవరకు సమంజసము? కాస్త ప్రశాంతముగా ఆలోచించండి.

గమనిక: పరిశుద్ధ బైబిలు గ్రంథాన్ని నలభైమంది పరిశుద్ధులు పదహారు వందల సంవత్సరాల పాటు ఎంతో ప్రయాసలకోర్చి సంకలనం చేశారు. అలాగే వారు పాత నిబంధనలో ఎందరెందరి కోసమో దేవునిచే ప్రవచించబడిన లేఖనాలను లిఖించారు. అలాగే యేసు పుట్టినప్పటినుండి ఆరోహణం అయ్యేంతవరకూ ఆయనకు సంబంధించిన సకల ప్రవచనాలనూ క్రొత్తనిబంధనలో పోల్చి చూపించారు కూడా. కాబట్టి వాటిని మాత్రమే యేసుకు చెందిన లేఖనాలుగా పరిగణించాలి. మనకు తోచిన వాటిని యేసుకు అన్వయించటానికి ప్రయత్నించకూడదు. అలాచేస్తే అది వాక్య అతిక్రమం అవుతుంది. యెషయా 7:14 లేఖనాన్ని మత్తయి 1:22-23వ వచనాలలో నెరవేర్పును చూపించటం జరిగింది. కాని నాలుగు సువార్తలలో ఎక్కడా యెషయా 9:6 లేఖనాన్ని నెరవేర్పుగా చూపలేదు. కారణం ఏమిటంటే అది యేసుకు సంబంధించింది కాదు కనుక!

## యేసు విషయంలో నిరీక్షణ ఏమిటి?

యేసు ఈ లోకానికి రాకపూర్వం ప్రజలు ఎలాంటి నిరీక్షణ కలిగి ఉండేవారు? అంటే ఆనాడు ప్రజలు సాక్షాత్తు యెహోవాయే అవతరించనున్నాడని నిరీక్షణ కలిగి ఉండేవారా? అని ప్రశ్నిస్తే బైబిలుగ్రంథం ఇచ్చే సమాధానం ఏమిటో గమనించగలరు.

**యెరూషలేమునందు సుమెయోనను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును భక్తిపరుడునైయుండి, ఇశ్రాయేలు యొక్క ఆదరణ కొరకు కని పెట్టువాడు: పరిశుద్ధాత్మ అతని మీద ఉండెను. అతడు ప్రభువుయొక్క క్రీస్తును చూడక మునుపు మరణము పొందడని అతనికి పరిశుద్ధాత్మచేత బయలు పరచబడి యుండెను.**

**-లూకా 2:25-26**

ఇక్కడ అత్యంత గమనార్హమైన విషయం ఏమిటంటే యేసుకొరకు నిరీక్షణ కలిగిఉన్న ఒక ప్రధానమైన వ్యక్తి సాక్ష్యం ప్రస్తావించబడింది. ఆ వ్యక్తి ప్రత్యేకత ఏమిటంటే ఒకటి అతడు '**నీతిమంతుడు**', రెండు '**భక్తిపరుడు**' మరియు మూడవ



ప్రత్యేకత ఏమిటంటే '**పరిశుద్ధాత్మ పూర్ణుడు**'. ప్రభువు యొక్క క్రీస్తును చూడనంత వరకూ అతనికి మరణము రాదు. వాక్యాన్ని మరొకసారి పరిశీలనగా చదవండి. '**ప్రభువు యొక్క క్రీస్తును చూడనంతవరకు**' అంతేగాని '**ప్రభువైన యెహోవాను చూడనంతవరకు**' అని లేఖనం చెప్పటం లేదు. పైగా ఈ విషయం అతను ఏకలలోనైనా చూచి చెబుతున్నాడా? కాదు. సాక్షాత్తు పరిశుద్ధాత్మచేత అతనికి బయలు పరచబడటం ద్వారా చెబుతున్నాడు. అయితే నేడు కొందరు యెహోవాయే యేసు అని చెబుతున్నారు. మరివీరు ఏ ఆత్మ ప్రేరేపణద్వారా చెబుతున్నారో? మీరు ఈ పాటికి గ్రహించే ఉంటారు. ఇక యేసు రాకడను గురించి సామాన్య ప్రజల నిరీక్షణ ఏమిటో ఈ క్రింది వాక్యంద్వారా గ్రహించగలరు.

**ఆ స్త్రీ ఆయనతో- క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును: ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియజేయునని చెప్పగా, యేసు- నీతో మాటలాడుచున్న నేనే ఆయనని ఆమెతో చెప్పెను.** **-యోహాను 4:25-26**

ఇక్కడ మాటలాడుతున్నది ఒక సామాన్య స్త్రీ. అలాంటి సాధారణ స్త్రీ నిరీక్షణ సైతం ఎంత స్పష్టంగా ఉన్నదో గమనించండి. ఆమె '**క్రీస్తనబడిన మెస్సీయ**' అంటున్నదే గాని, '**క్రీస్తనబడిన దేవుడు**' రానున్నాడని నేను నిరీక్షిస్తున్నాని చెప్పడం లేదు. పైన పేర్కొన్న రెండు వాక్యాల ప్రకారం పరిశుద్ధాత్మగాని, భక్తిపరులు, నీతిమంతులుగాని లేక చివరికి సాధారణ స్త్రీలు సైతం ఒక్కమాటలో చెప్పాలంటే ఏ ఒక్కరూ, ఏనాడూ దేవుడు ఈ లోకానికి రానున్నాడని అపోహపడిన కనీస వైనం మచ్చుకైనా కనిపించదు. అటువంటప్పుడు యెహోవాయే యేసుగా పుట్టాడని నమ్మటం, ప్రచారం చేయటం ఎంత దారుణమైన లేఖన అతిక్రమణో ఏ కాస్త ఆలోచించినా ఇట్టే అర్థమవుతుంది.

**ఆరవనెలలో గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యకయొద్దకు దేవునిచేత పంపబడెను. ఆ కన్యకపేరు మరియ. ఆదూత లోనికి వచ్చి ఆమెను చూచి- దయాప్రాప్తురాలా, నీకు శుభము ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను.**

**ఆమె ఆ మాటకు బహుగా తొందరపడి- ఈ శుభవచనమేమిటో అని ఆలోచించుకొను చుండగా దూత -మరియా, భయపడకుము: దేవునివలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును.** **-లూకా 1:26-32**

దీనికి ముందు పేర్కొన్న వచనంలో ఒక నీతిమంతుడు పరిశుద్ధాత్మపూర్ణుడై యేసును గురించి ఏవిధమైన అభిప్రాయం కలిగి ఉన్నాడో చూసాము. రెండవ వచనంలో ఒక సాధారణ స్త్రీ యేసుపట్ల ఎలాంటి నిరీక్షణ కలిగి ఉన్నదో గమనించాము. ఇప్పుడు యేసు జన్మించటానికి కేవలం తొమ్మిదినెలలముందు యేసు ఎవరై ఉంటారో మరియు ఆయన స్థాయి ఏమై ఉంటుందో ఈవచనం ఎంతో స్పష్టంగా వివరిస్తుంది. కనుక ఈ పైలేఖనానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది.

ఈ వచనాన్ని కాస్త నిశితంగా పరిశీలిస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు కనిపిస్తాయి. వాటిలో మొదటిది ఈ సమాచారాన్ని అందిస్తున్నది దేవుని ప్రధానదూత అయిన గబ్రియేలు. రెండవది ఆయన స్వతహాగా వచ్చి ఈ సమాచారాన్ని అందించలేదు. వాక్యంలో '**దేవుని చేత పంపబడెను**' అని ఉన్నది. అంటే ఆయన యేసును గురించి ఇస్తున్న సమాచారం, దేవునిచేత స్వయంగా పంపబడింది. మూడవది వాక్యభాగంలో- '**ఇదిగో! నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు**' అని ఉన్నది. నేటి కొందరు క్రైస్తవుల విశ్వాసం ప్రకారం అయితే ఆవాక్యం ఏ విధంగా ఉండాలి?- '**ఇదిగో! నీవు గర్భము ధరించి దేవుడిని కని అతనికి యేసు అని పేరు పెట్టుదువు**' అని ఉండాలి కదా! కాని అలాలేదే? నాలుగవది వాక్యభాగంలో- '**ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడు అనబడును**' **అని ఉన్నది. నేటి సువార్త ప్రకారం అయితే ఈ వాక్యభాగం 'ఆయన గొప్పవాడై సర్వోన్నతుడైన దేవుడనబడును'** అని ఉండాలి. కాని అలా లేదే! ఐదవది వాక్యభాగంలో- 'ప్రభువైన **దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును**' అని ఉన్నది. నేటి సువార్తీకుల ప్రకారమైతే వాక్యభాగం- 'ప్రభువైన



**దేవుడు తన సింహాసనమును యేసుకు ఇచ్చును**' అని ఉండాలి. మరి అలా లేదే! వాక్య విరుద్ధమైన దారుణ విశ్వాసాలు కలిగిఉంటూ, యేసు మా రక్షకుడు, మాకు నిత్యజీవం అభిస్తుంది అని భావించటం ఆత్మ వంచన కాదా? యేసు ఎవరో మరియు ఆయన స్థాయి ఏమిటో దేవుడు స్వయంగా గబ్రియేలుద్వారా వివరంగా చెప్పించినదానికి పూర్తివిరుద్ధ విశ్వాసాలు యేసుపట్ల కలిగి ఉన్నవానికి '**నేను యేసు సంబంధీకుడను, నేను క్రైస్తవుడను**' అని ప్రకటించుకొనే నైతిక అర్హత, ధార్మికహక్కు ఉంటుందంటారా? మీరే స్వయంగా ఆలోచించండి.

## యేసు కలిగి ఉన్న జీవము అతని సొంతమా?

యేసు ఎవరు? యేసు దేవుడా? అయితే ఆయన కలిగి ఉన్నవన్నీ ఆయన సొంతమై ఉండాలి. ఉదాహరణకు ఆయన కలిగి ఉన్న జీవం, శక్తి, సామర్థ్యాలు మరియు మహిమ మరొకరినుండి పొందబడినవై ఉండరాదు. ఎందుకంటే దేవుడనేవాడు '**స్వయం సంవృద్ధి**' కలిగి ఉండాలి. నిరాధారుడై ఉండాలి. ఏవిషయంలోనైనా ఇతరులపై ఆధారపడేవాడు దేవుడుకాలేడు. యేసు కలిగిఉన్న జీవము అతని సొంతమా? అని ప్రశ్నిస్తే యేసు స్వయంగా ఇచ్చే సమాధానాన్ని గమనించండి.

**జీవముగల తండ్రి నన్ను పంపెను గనుక నేను తండ్రి మూలముగా జీవించుచున్నట్టే**
**-యోహాను 6:57**

'**మీ జీవము ఎవరిది?**' అని ప్రశ్నిస్తే '**నాజీవము నా తండ్రి ప్రసాదితం**' అని యేసు సమాధానం ఇస్తున్నారు. '**తండ్రి మూలముగా జీవిస్తున్నాను**' అంటే నా స్వీయ జీవశక్తితో నేను జీవించటం లేదు అనేకదా! యేసు- '**నాతండ్రి మూలముగా జీవిస్తున్నాను**', అని ఎందుకు ప్రకటిస్తున్నారు? ఆయన ఈ క్రింది యథార్థాన్ని తెలుసుకున్నారు. ఏమిటి ఆ యథార్థం?

**యెహోవాయే నిజమైన దేవుడు, ఆయనే జీవముగల దేవుడు, సదాకాలము ఆయనే రాజు.** **-యిర్మీయా 10:10**

**'యెహోవాయే జీవముగల దేవుడు'** అని ఈ వాక్యభాగం ప్రకటిస్తుంది. దీనినిబట్టి ఒక్క యెహోవా తప్ప మరెవ్వరూ **'స్వీయ జీవశక్తి'** కలిగి లేరని అర్థమవుతుంది. అందుకే వాక్యములో **'ఆయన'** అనికాక **'ఆయనే'** అని దీర్ఘంతో మరీ నొక్కి చెప్పబడి ఉన్నది. యేసుకాని ఇంకా మరెవరైనా కాని ఒకవేళ యెహోవాతోపాటు **'స్వీయజీవశక్తి'** కలిగి ఉంటే ఒక్క యెహోవానే ఉద్దేశించి **'ఆయనే'** అని నొక్కి వక్కాణించబడి ఉండేదికాదు. యెహోవా ఒక్కడు మాత్రమే **'స్వీయజీవశక్తి'** కలిగి ఉన్నాడనే యథార్థం యేసుకు తెలుసు కనుకనే **'జీవముగల తండ్రి నన్ను పంపెను గనుక నేను తండ్రి మూలముగా జీవిస్తున్నాను'** అన్న నగ్న సత్యాన్ని ప్రకటిస్తున్నారు. యేసు స్వయంగా బోధించిన ఈ సత్యాన్ని పెడచెవిన పెట్టి యేసుకూడా యెహోవావంటి దేవుడేనని వాక్య విరుద్ధమైన బోధ చేస్తున్నారు. నమ్ముతున్నారు. ఇది వాక్య విరుద్ధమైన విశ్వాసము కాదంటారా? ఇది ముమ్మాటికి వాక్య విరుద్ధ బోధయే.

నిజమైన క్రైస్తవుడు యేసును ఎలా నమ్మాలి? అని ప్రశ్నిస్తే యేసు స్వయంగా తనకు తాను ఎలా పరిచయం చేసుకున్నారో సరిగ్గా అలాగే నమ్మాలి. అప్పుడు మాత్రమే నిజమైన క్రైస్తవుడు కాగలడు. **'నేను తండ్రి మూలముగా జీవిస్తున్నాను'** అని యేసు చేస్తున్న సుస్పష్టమైన ప్రకటనకు భిన్నంగా **'యేసుకూడా యెహోవాలాగే స్వీయజీవశక్తి కలిగి ఉన్నాడు'** అని భావిస్తే అతని ఆ విశ్వాసము యథార్థమైనది కాదు. అలాంటి వక్రవిశ్వాసంద్వారా రక్షణ లభించదు. యేసు, యెహోవాద్వారా జీవిస్తున్న ఒక **'సాధారణ మానవుడు మాత్రమే'** అని నమ్మి ఇంకా ఆయన దేవునిచే పంపబడిన **'ఒక గొప్ప రక్షకుడు'** అని విశ్వసించాలి. యేసుపట్ల ఇలాంటి విశ్వాసం కలవారికి మాత్రమే రక్షణ లభించగలదు.

## యేసు స్వయంగా ఈ లోకానికి వచ్చారా?

యేసు నిజంగా దేవుడే అయివుంటే ప్రజలకు ప్రత్యక్షం అవ్వటం, అవ్వకపోవటం అన్నది ఆయన స్వీయ అభీష్టం ప్రకారమే జరగాలి. ఎందుకంటే దేవుడనేవాడు 'సర్వ స్వతంత్రుడై' ఉంటాడు. 'పరతంత్రుడై' ఉండేవాడు దేవుడు ఏమాత్రం కాలేడు. ఈ విషయంలో యేసును **'ఓ యేసూ! ప్రజలు మిమ్మల్ని దేవుడు**



**అని పిలుస్తున్నారు కదా! మీరు నిజంగానే దేవుడా? అయితే మీరు స్వయంగా ఈ లోకానికి వచ్చారా? లేక మిమ్మల్ని ఎవరైనా పంపించారా?'** అని ప్రశ్నిస్తే యేసు స్వతహాగా ఇచ్చే సమాధానం ఏమిటో ప్రత్యక్షంగా చూడండి.

**అందుకు యేసు- నేను చేయుబోధ నాదికాదు; నన్ను పంపిన తండ్రి (యెహోవా) దే.** -యోహాను 7:16

**తనంతట తానే బోధించువాడు స్వకీయమహిమను వెదుకును గాని తన్ను పంపిన వాని (యెహోవా) మహిమను వెదకువాడు సత్యవంతుడు...** -యోహాను 7:18

**నా ఇష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని (యెహోవా) చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని.** -యోహాను 6:38

**నన్ను పంపిన తండ్రి (యెహోవా) వానిని ఆకర్షించితేనేగాని యెవడును నాయొద్దకు రాలేడు.** -యోహాను 6:44

**జీవముగల తండ్రి (యెహోవా) నన్ను పంపెను గనుక నేను తండ్రి (యెహోవా) మూలముగా జీవించుచున్నట్లే...** -యోహాను 6:57

**నేను ఒక్కడనైయుండక, నేనును నన్ను పంపిన తండ్రి (యెహోవా) యుకూడా ఉన్నాము...** -యోహాను 8:16

**నన్ను పంపినవాడు (యెహోవా) నాకు తోడైయున్నాడు...** -యోహాను 8:29

**...నేను దేవుని (యెహోవా) యొద్దనుండి బయలుదేరి వచ్చియున్నాను, నా అంతట నేనే వచ్చి యుండలేదు, ఆయన (యెహోవా) నన్ను పంపెను.** -యోహాను 8:42

**నన్ను పంపినవాడు (యెహోవా) సత్యవంతుడు, నేను ఆయనయొద్ద వినిన సంగతులే లోకమునకు బోధించుచున్నానని చెప్పెను.** -యోహాను 8:26

**ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు. నేను ఏమనవలెనో, ఏమి మాటలాడ వలెనో దానిని గూర్చి <u>నన్ను పంపిన తండ్రి (యెహోవా)</u> యే నాకాజ్ఞ యిచ్చియు న్నాడు.** **-యోహాను 12:49**

**నీతి స్వరూపుడవగు తండ్రీ (యెహోవా), లోకము నిన్ను ఎరుగలేదు, నేను నిన్ను ఎరుగుదును, <u>నీవు నన్ను పంపితివని</u> వీరెరిగియున్నారు.** **-యోహాను 17:25**

తన అభీష్టంతో ఈ లోకానికి రాలేదని యేసు స్వయంగా చెబుతున్న పై వాక్యాల ద్వారా అర్థం అవుతుంది. మరెలా వచ్చారు? సర్వశక్తిగల దేవుడైన యెహోవా పంపగా వచ్చారు. ఒకవేళ యేసు యెహోవావంటి దేవుడే అయి ఉంటే యేసు స్వతహాగా రావాలి. ఒకరు పంపితే వచ్చేవాడు దేవుడు ఎలాకాగలడు? అయినప్పటికీ ఇద్దరూ సమానమే అనుకుందాము. అయితే యేసు దీనిని ఒప్పుకుంటారా? క్రింది వాక్యాన్ని గమనించండి.

**దాసుడు తన యజమానునికంటే గొప్పవాడు కాడు, పంపబడినవాడు తన్ను పంపిన వానికంటే గొప్పవాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.** **-యోహాను13:16**

యేసు ఏమంటున్నారు? **'పంపబడినవాడు పంపినవానికంటే గొప్పవాడుకాడు'** అని అంటున్నారు. అటువంటప్పుడు **'యేసు, యెహోవా ఇద్దరూ సమానం'** అని ఆయనే ఈయన అని నమ్మటం, దానిని ప్రచారం చేయటం ఎంతటి అపచారమో ఒక్కసారి అలోచించండి.

యేసుద్వారా రక్షించబడాలంటే యేసు తన విషయంలో మరియు యెహోవా విషయంలో ఎలాంటి అభిప్రాయాలు కలిగి ఉన్నారో సరిగ్గా అలాంటి అభిప్రాయాలనే యేసు-యెహోవా పట్ల మనమూ కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే **'మేము యేసు సంబధీకులం'** అని ప్రకటించుకునే అధికారం కలిగి ఉండగలము. అలా కానప్పుడు నేను క్రైస్తవుడను అని చెప్పటం కేవలం ఆత్మవంచన మాత్రమే కాగలదు.



## యేసు మహిమ అతని సొంతమా?

యేసు ఎవరు? అన్న ప్రశ్నకు వెంటనే వచ్చే సమాధానం **'యేసుదేవుడు'**. ఏ వ్యక్తికైనా లేక ఏ వస్తువుకైనా ఒక ప్రత్యేకతను ఆపాదిస్తున్నప్పుడు అతనిలో లేక దానిలో ఆ ప్రత్యేకత ఉందా? లేదా? అన్న స్పృహ ఉండాలి. అలాంటి స్పృహ లేకుండా కేవలం తన ఇష్టాన్నిబట్టి, తన గుడ్డి నమ్మకాన్నిబట్టి ఆ యా ప్రత్యేకతలను ఆ యా వస్తువులకు ఆపాదించటం వట్టి మూఢత్వమవుతుంది, అజ్ఞానం అనిపించు కుంటుంది. ఇది శాస్త్రీయ యుగం. కనుక మన విశ్వాసాలూ, వాదనలూ హేతుబద్ధం గానూ, అర్థవంతంగానూ ఉండాలి. అలాంటి వాటినే నమ్మాలి, ప్రచారం చేయాలి. అప్పుడు మాత్రమే విజ్ఞతగల వ్యక్తులూ కాగలరు మరియు ఎదుటివారి ద్వారా విజ్ఞులుగా కీర్తించబడనూ గలరు. ముఖ్యంగా వ్యక్తిగత జీవితంలో మనశ్శాంతిని నైతికతను పొందగలరు. ఇంకా సమాజాన్ని శాంతికీ నీతికి నిలయంగా మలచగ లరు. ఒక విశ్వాసి అంతిమ లక్ష్యమైన నిత్యజీవాన్నీ సాధించగలరు. **'దున్నపోతు ఈనింది!'** అని ప్రచారకులు చెబుతుంటే **'దూడను కట్టేయండి!'** అని విశ్వాసులు అంటున్న పరిస్థితి నేటి సువార్తా రంగంలో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే వ్యక్తుల మనస్సులలో శాంతి, వారి ప్రవర్తనలో నీతి పూర్తిగా పూజ్యమైపోయింది. పర్యవసానంగా నేటి వ్యక్తుల మనస్సులు అశాంతికి నిలయాలుగా మరియు సమాజం అవినీతికి నివాసంగా మారిపోయింది.

సృష్టికర్త అయిన దేవుడు మనిషి మానసిక శాంతికి, శారీరక ఆరోగ్యానికి మరియు సామాజిక నీతికొరకు ఎన్నో మార్గదర్శకాలను ఇచ్చాడు. వాటిలో భాగంగా తనపట్ల, అలాగే తన పరిశుద్ధులైన మహనీయులు ఎలాంటి విశ్వాసాలు కలిగి ఉండాలో దేవుడు స్వయంగా ఆదినుండీ బోధిస్తూ వచ్చాడు. అయితే స్వార్థపరుల స్వార్థం ఎలా పని చేసిందో గమనించండి.

**ఇది యొక్కటి మాత్రము నేను కనుగొంటిని, ఏమనగా దేవుడు నరులను యథార్థ వంతులుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములను కల్పించుకొని యున్నా రు.** **-ప్రసంగి 7:29**

మనుష్యులకు దేవుడుచూపిన మార్గం ఎలాంటి వక్రతా లేకుండానే ఉన్నది. అయితే ఈనాటి ధర్మావలంబికులలో పొడచూపే ఈ వక్రతలన్నీ ఎక్కడినుండి దాపురించాయని ప్రశ్నిస్తే కొందరు స్వార్థపరులు సృష్టించిన తంత్రములు అనగా లేఖన విరుద్ధ విశ్వాసాలని వాక్యం స్పష్టం చేస్తుంది. ఈ తంత్రగాళ్ల వలయం నుండి బయటపడేదెలా? అని ప్రశ్నిస్తే యేసు దానికిగల యుక్తిని వివరిస్తున్నారు.

**నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి** -మత్తయి 11:29

పై వాక్యంలో మూడు విషయాలు కనిపిస్తున్నాయి. అవి:

1. **యేసు వ్యకిగత స్వభావం. సాత్వికత మరియు దీనమనస్తత్వం. ఈ లక్షణాలు గల వానికి మరియు వ్యక్తిగత స్వార్థమే పరమావధిగా పెట్టుకొన్న తంత్రగాడికీ భూమి-ఆకాశాలంత వ్యత్యాసం ఉంటుంది అని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.**

2. **'కనుక నాకాడి మీమీద ఎత్తుకొనుడి' అని ఆజ్ఞాపిస్తున్నారు. దీని అర్థం ఏమిటి? 'నాకాడి' అనగా నేను ప్రతిపాదిస్తున్న విశ్వాసము, ఆలోచన అని అర్థం. అదెలా ఉంటుంది? సాత్వికంగానే ఉంటుంది. అనగా ఆచరణ యోగ్యంగాను, పరివర్తనాత్మకంగానూ ఉంటుంది.**

3. **ఈ విశ్వాసాన్ని లేక ఈ దృక్పథాన్ని 'నాయొద్ద నేర్చుకొనుడి' అని ఆజ్ఞాపిస్తున్నారు.**

ఈ గందరగోళ విశ్వాసాలనుండి బయటపడే ఏకైక మార్గం, యేసు ప్రత్యక్ష బోధనల వెలుగులో మన ఆలోచనా విశ్వాసాలను సంస్కరించుకోవటం ఒక్కటే.

## మహిమ అనగా ఏమిటి?

మహిమ అనగా ఐశ్వర్యము, మహత్తు, గొప్పతనము మరియు ఔన్నత్యము లాంటి అర్థాలు చెప్పవచ్చు. దేవుడనేవానికి ఈ మహిమ అతని సొంతమై ఉండాలి. అతడు ఒకరిద్వారా పొందినదో లేక ఎరువు తెచ్చుకున్నదో అయి ఉండరాదు. ఇంకా



ఆయన ఆ మహిమ తిరిగి వేరొకరికి వాపసు చేసే వాడై ఉండకూడదు. అలాంటివాడే దేవుడు అని అనిపించుకునే అర్హత కలిగి ఉంటాడు. ఆ విధంగా సొంతమహిమ కలిగి ఉన్నవాడు బైబిలుగ్రంథంలో ఎవరు? అని ప్రశ్నిస్తే...

**యెహోవాను నేనే, ఇదే నా నామము మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చువాడను కాను. నాకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనీయను.** -యెషయ42:8

పైవాక్యంలో గమనార్హమైన విషయాలు.

1. **'నామహిమ' అని సృష్టికర్త అంటున్నాడు. అనగా అతని సొంతమహిమ. ఒకరి ద్వారా ఆయన పొందినది కాదు అని తెలుస్తోంది.**

2. **ఆ 'నా సొంతమహిమ' ఇతరులకు పూర్తిగా ఇచ్చివేయటమన్నమెన్నటికీ జరగనిపని. ఈ విధంగా సృష్టికర్త మహిమ తనసొంతం అని ఇతరులకు ఇవ్వను అని స్పష్టంగా బహిరంగంగా ప్రకటిస్తున్నాడు.**

## యెహోవా తన మహిమను యేసుకు శాశ్వతంగా ఇచ్చేశాడా?

ఈనాటి ప్రచారంలో 'సువార్త' పేరిట వినిపించే మాట ఏమిటి? యేసు గొప్ప మహిమగల దేవుడు. యేసును దేవుడుగా నమ్మండి. యేసు మహిమాన్వితుడు. అయితే ఇది ఎంతవరకు వాస్తవం. ఈ విషయంలో యేసు ఏమంటున్నారు ?

**అందుకు యేసు- నన్ను నేనే మహిమ పరచుకొనిన యెడల నా మహిమ వట్టిది. మా దేవుడని మీరెవని గూర్చి చెప్పుదురో ఆ నా తండ్రియే నన్ను మహిమ పర చుచున్నాడు.**

-యోహాను 8:54

ఈవాక్యం ప్రకారం నాకు ఉన్న గొప్పతనం నా సొంతం కాదు. అది నాదేవుడు నాకు ప్రసాదించింది అని యేసు స్పష్టపరుస్తున్నారు. అయితే దేవుడు ప్రసాదించిన ఈ మహిమను యేసు తనే సొంతం చేసుకొన్నారా? ఆ మహిమ ఆయన సొంతం అయిపోయిందా? దీనికి యేసు ఏమంటున్నారో పరిశీలిద్దాం.

**మనము ఏకమైయున్నలాగున వారును ఏకమైయుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వానికిచ్చితిని.** **-యోహాను 17:22**

సృష్టికర్త ద్వారా పొందిన మహిమ యేసు పరమైపోతే ఇక యేసేదేవుడు అంటే అదికాస్త అర్థవంతంగా ఉంటుంది. ఇక్కడ రెండు బలహీనమైన విషయాలు కనిపిస్తున్నాయి. ఒకటి యేసువద్ద ఉన్న మహిమ అతని సొంతం కాదు. రెండవది అదికాస్తా, తన శిష్యులకు ఇచ్చివేశారు. అటువంటప్పుడు యేసును మహిమగల దేవుడని ఎలా అనగలరు? అయితే యేసు కలిగి ఉన్న మహిమ విషయంలో ఆదిమ అపోస్తలుల విశ్వాసం ఏమిటి? అని ప్రశ్నిస్తే దానికి యేసు స్వయంగా ఇస్తున్న సమాధానాన్ని గమనించండి.

**నీవు (యెహోవా) నాకు (యేసుకు) అనుగ్రహించినవన్నియు నీవలననే (యెహోవా వలనే) కలిగినవని వారిప్పుడు ఎరిగి యున్నారు.** **-యోహాను 17:8**

ఇదండి ఆదిమ అపోస్తలుల విశ్వాసము. యేసు ఏ మహిమలు, ఏ మహత్యాలు కలిగి ఉండేవారో అవన్నీ యేసు దేవుడై ఉన్న కారణంగా కాదు. నీవు అంటే సృష్టికర్త అయిన దేవుడు. నాకు అంటే యేసుకు అనుగ్రహించాడని, వారి అంటే శిష్యులు ఇప్పుడు గ్రహించారని యేసు స్వయంగా చెబుతున్నారు.

పై వాక్యం ప్రకారం సువార్త ఎలా ఉండాలి?-

ప్రజలారా! ఏ దేవుడైతే యేసును క్రీస్తుగా నియమించాడో, ఆ దైవాన్ని నమ్ముకోండి! రక్షించబడతారు. యేసు పొందిన దైవానుగ్రహం మరియు దైవప్రసన్నత మీరూ పొందాలంటే- యేసును ఆదర్శంగా చేసుకొని, అనుసరించండి. యేసులా మీరూ '**రక్షించబడతారు**' అని సాగాలి.

అప్పుడు ప్రజలలో పరివర్తన, మార్పు సంభవిస్తుంది. తద్వారా వ్యక్తుల మనసులలో '**శాంతి**', వ్యక్తిత్వాలలో '**నీతి**' ఇంకా సంఘంలో '**ఐక్యత**' వంటి విలువలు పరిఢవిల్లుతాయి. తద్వారా క్రైస్తవ సమాజం ఒక నైతిక విలువలు కలిగిన సమాజంగా పరివర్తన చెంది, గత వైభవాన్ని సాధించగలదు. యేసు స్వయంగా చెప్పే ఈ క్రింది విషయాన్ని గమనించగలరు.



**...మీమీద నాకాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును.** **-మత్తయి 11:29**

యేసు చేస్తున్న సువార్త యథార్థతను అర్థం చేసుకొని దానికనుకూలంగా మన జీవనశైలిని మార్చుకుంటేనే అంర్బాహ్యాలలో విశ్రాంతి సాధ్యమని బోధపడుతుంది. ఆదిమ శిష్యులలోని ప్రధాన శిష్యుడు, యేసు ద్వారా ధన్యతను పొంది, యేసు వారసత్వానికి అర్హుడైన పేతురు విశ్వాసం యేసుపట్ల ఏమిటో ఈ క్రింది చూడగలరు.

**అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు అనువారి దేవుడు అనగా మన పితరుల దేవుడు (యెహోవా) తన సేవకుడయిన యేసును మహిమ పరచియున్నాడు.-అపో॥ కా॥ 3:13**

ఆనాటి ఆదిమ అపోస్తలులు యేసుపట్ల ఎలాంటి విశ్వాసము కలిగి ఉండేవారో పై వాక్యాన్ని బట్టి అర్థమవుతుంది. ఫలానా, ఫలానా వారి దేవుడు అని యెహోవాను గురించి ఎంతో స్పష్టంగా చెప్పి, యేసు విషయంలో మటుకు- ఈనాటి బోధకులవలే '**యేసు మహిమగల దేవుడు**' అనికాక '**యేసు మహిమగల సేవకుడు**' అని సవివరంగా ప్రకటిస్తున్నారు. దీనిని బట్టి- ఆనాటి యేసు ప్రత్యక్ష శిష్యులు ఈనాటి క్రైస్తవ పండితుల మాదిరిగా యేసే మహిమగల దేవుడు అన్న విశ్వాసం కలిగి ఉండేవారు కాదని ఎంతో స్పష్టంగా అర్థమవుతుంది.

'**యేసు ఎవరు?**' అని ఆయన పట్లగల మీ '**విశ్వాసం**' గురించి ప్రశ్నిస్తే- "**యేసు దేవుని సృష్టి మరియు యేసు దేవునిచే నియమించబడిన వాడు (క్రీస్తు)**" అని ఇంకా...

"**యేసుతో మీ 'సంబంధం' ఏమిటి?**" అని ప్రశ్నిస్తే-

"**యేసు 'దేవుడు' అయి ఉన్నాడని భ్రమకు లోనై ఆరాధించటం కాదు. యేసు 'మాదిరి' అయి ఉన్నాడనే సత్యాన్ని గుర్తించి, వెంబడించటం**"

అన్న వాక్యానుసారమైన, లేఖనానుసారమైన సమాధానం ఇవ్వాలని ఇప్పటి వరకు సాగిన పరిశుద్ధ బైబిలు గ్రంథ పరిశీలనద్వారా ప్రస్ఫుటమయ్యింది.

యేసు ప్రబోధించిన మరియు ఆదిమ అపోస్తలులు కలిగి ఉండిన పై '**యథార్థ విశ్వాసం**' మాత్రమే యేసుపట్ల కలిగి ఉండే మహా భాగ్యాన్ని ఆ దేవాది దేవుడు మనందరికి కలిగించును గాక. -ఆమేన్.